సాక్షి సంగారెడ్డి
బుధవారం । 1 । మే । 2024

కమలంలో జోష్

- అల్లాదుర్గం చిల్వెరలో బీజేపీ జనసభ
- పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- మోదీ నామస్మరణతో హోరెత్తిన సభా ప్రాంగణం



సభలో అభివాదం చేస్తున్న మోదీ

మెదక్‌జోన్/అల్లాదుర్గం(మెదక్) /మెదక్‌జోన్: అల్లాదుర్గం సభ విజయవంతం కావటంతో బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు మోదీ, మోదీ అంటూ ఏకధాటిగా నినాదాలు చేశారు. దాంతో సభా ప్రాంగణం మోదీ నామస్మరణంతో దద్దరిల్లింది. ఈ సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సుమారు లక్షకు పైగా జనం తరలి వచ్చారు. ఏప్రిల్ 25న సిద్దిపేట జిల్లాలో ఏర్పాటు చేసిన బీజేపీ బహిరంగ సభకు కేంద్రమంత్రి అమిత్‌షా హాజరైన విషయం విదితమే. అలాగే గతనెల 18న, మెదక్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు గోవా ముఖ్య మంత్రి ప్రమోద్ స్రవంత్‌లు హాజరయ్యారు. వరుస సభలు సక్సెస్ కావటంతో బీజేపీ నేతలు ప్రచారంలో దూసుకెళుతున్నారు.



సభకు హాజరైన జనం

25 మంది ఎమ్మెల్యేలతో హరీశ్ జంప్: రఘునందన్ రావు

అధికారం కోల్పోయాకనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాం హౌస్ నుంచి బయటకు వచ్చారని బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గద్దె దిగితేనే ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్, కాళేశ్వరం కేసులో ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రథమ ముద్దాయి అని, లిక్కర్ కేసులో ఇప్పటికే ఆయన మరదలు (కవితను) తీహార్ జైలుకు పంపారన్నారు. ఆమెను జైల్లో పరామర్శించిన హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావులు ఇటీవల ఢిల్లీ నుంచి ఒకే విమానంలో పక్కపక్కనే కూర్చొని రెండుగంటల పాటు మాట్లాడుకుంటూ వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం 25 ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు పార్టీమారే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు.



మోదీకి జ్ఞాపికను అందిస్తున్న బీబీ పాటిల్, పక్కన కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు

15 స్థానాలు పక్కా : కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తోడు దొంగలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అల్లాదుర్గం మండలం చిల్వెరలో ఏర్పాటు చేసిన జనసభలో ఆయన ప్రసంగించారు. బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని పేర్కొన్నారు. అందుకే బీజేపీని బద్నామ్ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా మాటలను వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల ఏప్రిల్ 25న సిద్దిపేటలో జరిగిన సభలో మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తామని అమిత్‌షా చెబితే.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఫేక్ వీడియోలు సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారిని వదలబోమని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 15 స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఏ గ్రామానికెళ్లినా ఈసారి బీజేపీకే తమ ఓటంటూ తీర్మానాలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు.

సంగమేశ్వరుడికి మోదీ ప్రణామం

జహీరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసంగానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరుడికి సభావేదికపై నుంచి ప్రణామం చేశారు. అనంతరం బసవేశ్వరుడు, సేవాలాల్ మహారాజ్‌లను సైతం స్మరించుకున్నారు. మంగళవారం అల్లాదుర్గంలో బీజేపీ నిర్వహించిన జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభకు ప్రధాని హాజరయ్యారు. కేతకీ సంగమేశ్వర దేవాలయం దక్షిణ కాశీగా విరాజిల్లుతోంది.. జిల్లాలోనే కాకుండా పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని భక్తులు కేతకీ ఆలయానికి అధికంగా వచ్చి దర్శించుకుంటారు. మాజీ హోంమంత్రి శివరాజ్‌పాటిల్ కుటుంబ దైవం కూడా కేతకీ సంగమేశ్వరుడే అని చెప్పారు. కాగా, కేతకీ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉండటాన్ని గుర్తించి సంగమేశ్వరుడిని ప్రస్తావించారు. అలాగే.. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ పరిధిలో లింగాయత్‌లు అధికంగా ఉండడం, వారి దైవం బసవేశ్వరుడు కావడంతో ఆయన పేరును, గిరిజన తండాలు సైతం అధికంగా ఉండటంతో వారి దైవమైన సేవాలాల్ మహారాజ్ పేర్లను స్మరించుకున్నారు. ప్రజల సెంటిమెంట్ గురించి తెలుసుకుని ఈ మేరకు ప్రస్తావించారు. దీంతో సభకు వచ్చిన జనం సంతోషంతో కేరింతలు పెట్టారు.

ఓటమి భయంతోనే మతవిద్వేషాలు
జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

కాంగ్రెస్ ఓటమి భయంతో మతవిద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు చేపడుతుందని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. మోదీ పదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రి చేయడానికి కమలం గుర్తుకు ఓటేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇద్దరు ముఖ్యమంత్రులును ఓడించింది బీజేపీ కార్యకర్తలేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సభలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, దక్, సంగారెడ్డి, కామారెడ్డి పార్టీ జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, అరుణతార, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మేడే ను జయప్రదం చేయండి

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో మేడే వేడుకలను అట్టహాసంగా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్, కార్యదర్శి జి.సాయిలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నుంచి ఉత్సవాలు జరుపుకోవడానికి అనుమతి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక, మండల కేంద్రాలు, గ్రామాల్లో జెండావిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం హక్కులను హరిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. కార్మిక హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంగారెడ్డిలో నిర్వహించే సభలో రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ధర్మరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ

నారాయణఖేడ్: మానవ జన్మ గొప్పదని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. మనూరు మండల కేంద్రంలో రాఘవాచారి జ్యోషి స్వగృహంలో మంగళవారం భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నో జన్మల పుణ్యఫలం ఉంటేనే మానవుడిగా జన్మించగలుగుతామని అన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ నిత్యం భగవంతుడిని స్మరిస్తూ ధర్మ రక్షణ కోసం పాటుపడాలని చెప్పారు. ఆచారాలను కాపాడుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ విధానంలో జరుగుతున్న టెన్త్, ఇంటర్ పరీక్షలు ఐదవ రోజు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం పదవ తరగతికి ఉదయం సోషల్, మధ్యాహ్నం ఉర్దూ పరీక్ష జరగగా, ఇంటర్ అభ్యాసకులకు ఉదయం హిస్టరీ మధ్యాహ్నం మ్యాథ్స్ పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పదవ తరగతి పరీక్షలకు 2,229 మందికి గానూ 1,974 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షకు 464 మందికి గానూ 416 మంది హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన పదవ తరగతి పరీక్షకు 414 మందికి గాను 381 మంది, ఇంటర్ పరీక్షకు 434 మందికి గాను 353 మంది హాజరయ్యారు.

టాస్క్ పేరుతో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ఓ ప్రైవేట్ ఉద్యోగి మోసపోయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి నరేందర్ టెలిగ్రామ్‌కు మార్చి 14వ తేదీన ఓ లింక్ వచ్చింది. దాన్ని ఓపెన్‌చేస్తే పెట్టుబడి పెట్టి ఇచ్చిన టాస్క్ లు పూర్తిచేస్తే లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపారు. దీంతో అతని వివరాలను అందులో నమోదు చేసి పలు దఫాలుగా రూ.1.97 లక్షలు పెట్టుబడి పెట్టాడు. దీంతో బాధితుడు తాను పెట్టిన నగదు తో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించాడు. ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగస్టులో రుణమాఫీ పక్కా



పందిల్లలో తాటి ముంజలు కోస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గ్యారంటీగా అమలు చేసి తీరుతామని, ఆగస్టులో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పందిల్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రం నిధులు తేవాలంటే కాంగ్రెస్ పార్టీకే అధికారం ఇవ్వాలని కోరారు. పదేళ్లలో దేశ సంపదను మోదీ అంబానీ, అదానీలకు దోచిపెట్టారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. మా నాన్నకు ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రజాసేవకు ముందుకు వచ్చానని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అడుగుజాడలో నడిచి ఉమ్మడి కరీంనగర్ ప్రజలకు సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు, కర్ణకంటి మంజురెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- సమష్టి కృషితో సురేష్ షెట్కార్‌ను గెలిపించండి
- మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్(అందోల్) : నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. రాయికోడ్‌లో నిర్వహించిన సమావేశంలో జహీరాబాద్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌తో కలిసి మంత్రి మాట్లాడారు. 62 ఏళ్లుగా తమ కుటుంబానికి రాజకీయ అనుబంధం ఉందని, కార్యకర్తలను గౌరవించడం, కాపాడుకోవడం తన బాధ్యత అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం ఐదు అమలు చేసిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తాను ఉప ముఖ్యమంత్రిగా ఉండి వందల మంది యువకులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో దేశంలోనే మొదటిసారి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తీసుకువచ్చామన్నారు. పదేళ్లుగా వృథాగా ఉన్న బొగ్గులంపల్లి ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి రైతులకు అండగా నిలిచామన్నారు. రాయికోడ్‌కు స్పోర్ట్స్ కళాశాల మంజూరు చేయిస్తే బీఆర్ఎస్ పాలనలో ఇతర ప్రాంతానికి తరలించారన్నారు. మునిపల్లి మండలం బుదేర నుంచి రాయికోడ్ మండలం సిరూర్ వరకు రూ.80 కోట్ల నిధులతో రహదారి నిర్మాణం కోసం కృషి చేస్తున్నానన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో ఎంపీపీ మొగులప్ప, జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్, జి.అంజయ్య, బి.నర్సింలు, ప్రభాకర్, సిద్దప్ప పాటిల్, బసవరాజ్ పాటిల్, కేధారినాథ్ పాటిల్, నాగిశెట్టి పాల్గొన్నారు.

సేవ చేసేందుకు ఒక్క అవకాశం ఇవ్వండి



రోడ్‌షోలో మెదక్ అభ్యర్థి నీలం మధు

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తనకు ఎంపీగా ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటానని కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధు కోరారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని పెద్దాపూర్, నందికంది, నిజాంపూర్, ఆత్మకూర్ తదితర గ్రామాల్లో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డితో కలిసి రోడ్‌షో, బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే దేశంలోని మహిళలందరికీ ఏడాదికి లక్ష రూపాయలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్, మండల అధ్యక్షులు గడీల రాంరెడ్డి, సిద్దన్న, నాయకులు పులిమామిడి రాజు, చేర్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్, మల్లెపల్లి, గొల్లపల్లిలో నీలం మధు, నిర్మలారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని మతాలకు న్యాయం జరుగుతుందని, కేంద్రంలో బీజేపీ ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై ప్రభు, మండల నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశం గౌడ్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా

బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



రాయికోడ్ : రోడ్‌షోలో మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

రాయికోడ్(అందోల్) : ఎంపీగా తనను గెలిపిస్తే యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. రాయికోడ్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కలిసి రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పేవారిని నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. 5 నెలలకే కేసీఆర్ లేని లోటు కనిపిస్తోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, విఠల్, తుకారాం, సంగమేశ్వర్, కిష్టారెడ్డి, సుభాష్‌రెడ్డి, గంప చంద్రశేఖర్, మాణిక్యం, వీరారెడ్డి, శివాజీరావు పాల్గొన్నారు.

దర్గాలో పూజలు

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గాలి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో కలిసి వట్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటఖ్వాజా దర్గాలో ప్రార్థనలు చేశారు.

97.86 %
టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత

- బాలికలదే పైచేయి
- రాష్ట్రంలో జిల్లాకు 5వ స్థానం
- 296 పాఠశాలలో వంద శాతం ఫలితాలు
- 435 మంది విద్యార్థులకు 10 జీపీఏలు



కొండాపూర్(సంగారెడ్డి): పదవ తరగతి ఫలితాలు కొంత నిరాశను కలిగించాయి. ఈసారి ఉత్తీర్ణత శాతం కొంత తగ్గింది. గత రెండేళ్లుగా టెన్త్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఫలితాలలో 5వ స్థానంలో నిలిచింది. అయితే ఇంటర్మీడియట్ ఫలితాల మాదిరిగానే పది ఫలితాలలోనూ బాలికలు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో జిల్లాలో 97.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 22,012 మంది పరీక్షలు రాయగా 21,540 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 97.86 ఉత్తీర్ణత శాతం నమోదైంది, వీరిలో 11,136 మంది బాలురకు గాను 10,852 మంది ఉత్తీర్ణత సాధించారు. 284 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. అదే విధంగా 10,876 మంది బాలికలకు గానూ 10,688 మంది ఉత్తీర్ణత సాధంచగా 188 మంది బాలికలు ఫెయిల్ అయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 97.45 కాగా, బాలికల శాతం 98.27గా నమోదైంది.

296 పాఠశాలలో 100శాతం

జిల్లా వ్యాప్తంగా 460 పాఠశాలలకు గానూ 296 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. వీరిలో 116 ప్రైవేట్ పాఠశాలలు కాగా 180 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలో 123 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 8 మోడల్ స్కూళ్లు, 12 కస్తూర్బా పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒక గురుకుల పాఠశాల, 10 బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, 10 సోషల్ వెల్ఫేర్ 6 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, 8 మైనార్టీ గురుకుల పాఠశాలలున్నాయి. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 435 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

నాలుగు మండలాల్లో..

జిల్లాలో 28 మండలాలకు గాను నాలుగు మండలాల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. మనూర్, నాగలిగిద్ద, వట్‌పల్లి, కల్హేర్ మండలాల్లో వంద శాతం ఫలితాలు రాగా.. అందోల్, కంది, మునిపల్లి, సిర్గాపూర్, మొగుడంపల్లి, అమీన్‌పూర్, హత్నూర, కొండాపూర్ మండలాల్లో 99 శాతం ఫలితాలు వచ్చాయి.

- 17 కస్తూర్బా పాఠశాలలకు గాను 12 కస్తూర్బా పాఠశాలలో 100 శాతం ఫలితాలు వచ్చాయి. కేజీబీవీలలో 636 మంది పరీక్షలు రాయగా 630 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మనూర్ మండలం పుల్‌కుర్తిలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థి నిఖిత 10 జీపీఏ సాధించింది.
- 11 బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు 10 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 694 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 693 మంది ఉత్తీర్ణత సాధించారు. బీసీ వెల్ఫేర్ పాఠశాలలో 31 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.
- 11 సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు 10 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 867 మంది విద్యార్థులకు 866 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 14 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.
- 12 మైనార్టీ పాఠశాలలకు గాను 8 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 694 మంది విద్యార్థులకు గానూ 688 మంది ఉత్తీర్ణత సాధించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 11 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.
- 10 ఆదర్శ పాఠశాలలకు గాను 8 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. వీటిలో 950 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 944 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 8 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.
- జిల్లాలో 10 మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలకు గానూ అన్ని పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 31 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, 56 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు.
- కొండాపూర్ మండలంలో 15 పాఠశాలలు ఉండగా 11 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. మండలంలో ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

క్లుప్తంగా

మోదీకి గిఫ్ట్‌గా ఇద్దాం

- మెదక్‌లో బీజేపీ జెండా ఎగరేద్దాం
- పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

వర్గల్(గజ్వేల్): మెదక్‌లో బీజేపీ పార్టీని గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని మెదక్ లోక్‌సభ అభ్యర్థి ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం వర్గల్ మండలం నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దచెరువు వద్ద ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కూలీలను కలిసి మాట్లాడారు. గతంతో పోల్చితే ఉపాధి కూలీల దినసరి వేతనం చాలా తక్కువగా ఉండేదన్నారు. ప్రధానిగా మోదీ వచ్చిన తర్వాత కూలి.. రూ. 300 లకు పెంచారన్నారు. పేదలకు ఉచితంగా 6 కిలోల రేషన్ బియ్యం ఇస్తున్న ఘనత మోదీదేనన్నారు. మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లను అభ్యర్థించారు.

యువకుడి అదృశ్యం



రాజ్‌కుమార్

రామాయంపేట(మెదక్): యువకుడు అదృశ్యమైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ రంజిత్ కథనం ప్రకారం.. గుల్పర్తి గ్రామానికి చెందిన కుమ్మరి రాజ్‌కుమార్ (26) అదృశ్యమయ్యాడు. కుమ్మరి వృత్తితో పాటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 20న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు అతని భార్య వసంత మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్ చోరీపై చర్యలేవీ?

- బాధితుడు జ్ఞానోబారావు ఆవేదన
- మరో దొంగతనం చేస్తుండగా దొంగను పట్టించినా ఫలితం శూన్యమని ఆరోపణ

నారాయణఖేడ్: బైక్ చోరీ కేసుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పట్టణానికి చెందిన జ్ఞానోబారావు తెలిపారు. మార్చి 31న తన బైక్ చోరీకి గురి కాగా ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో దొంగ ఆనవాళ్లతో కూడిన సీసీ ఫుటేజీతోపాటు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని ఆయన వాపోయాడు. తన వాహనం చోరీ జరిగిన వారంలోపు మరో బైక్ సదరు దొంగ చోరీకి పాల్పడుతుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించామన్నారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. ఈ విషయంపై సీఐ శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించగా తాను వివరాలు కనుక్కొని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



లింగేశ్వర్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తికి చెందిన లింగేశ్వర్ రెడ్డి(34) జీవనోపాధి కోసం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీకి వలస వచ్చాడు. కాలనీలో అద్దెకు నివాసముంటూ ఓ ప్రైవేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే లింగేశ్వర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమలోత్సాహం









అల్లాదుర్గం జనసభలో నేను మోదీ కుటుంబం అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బీజేపీ కార్యకర్తలు



నేను విజిల్ వేస్తే..



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

గొంతెండుతోంది..

- తాగు నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు
- చేగుంట-మెదక్ రహదారిపై రాస్తారోకో

చిన్నశంకరంపేట(మెదక్): తాగు నీటి కోసం ఖాళీ బిందెలతో చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీ(గాంధీనగర్)కి చెందిన మహిళలు.. గంటపాటు మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం రెండు బిందెల నీరు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాటర్‌మన్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. ఆపై దురుసుగా మాట్లాడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, విద్యుత్ సరఫరా కూడా సరిగా లేకపోవడంతో ట్యాంకు నిండటం లేదని చెప్పినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఈఓ సంతోష్ కుమార్ వచ్చి.. హామీ ఇచ్చే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఫోన్ ద్వారా మహిళలతో మాట్లాడారు. నీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తానమన్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు సైతం ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో శాంతించారు.

అయ్యో పాపం

- ఇటీవల ప్రకృతి ప్రకోపానికి బలైన వెంకటేశ్
- టెన్త్‌లో రాసిన రెండు సబ్జెక్ట్‌ల్లోనూ పాసైన బాలుడు



మన్నె వెంకటేశ్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: మండలంలోని కొల్గూరుకు చెందిన టెన్త్ విద్యార్థి రాసిన రెండు సబ్జెక్ట్‌ల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అతని జ్ఞాపకాలను నెమరవేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన మన్నె సత్తయ్య-రేణుక దంపతుల రెండో కొడుకు మన్నె వెంకటేశ్(15) అలియాస్ చింటూ. అహ్మదీపూర్.. జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి. మార్చిలో జరిగిన తెలుగు, హిందీ పరీక్షలకు హాజరయ్యాడు. మరుసటి రోజు (మార్చి 19)న సెలవు ఉండడంతో సాయంత్రం సమయంలో బావి వద్ద నుంచి బర్రెలను ఇంటికి తోలుకొని వస్తున్నాడు. గ్రామంలోకి రాగానే ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇదే సమయంలో వీచిన గాలులకు రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ విరిగి వెంకటేష్‌పై పడింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అక్కడకు చేరుకొని చెట్టుకొమ్మను తొలగించినప్పటికీ అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం 10వ తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కాగా రాసిన తెలుగు, హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణుడైనట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అతను మిగతా పరీక్షలు రాసి ఉంటే అన్నింటిలో ఉత్తీర్ణుడయ్యేవాడని... అయ్యో పాపం అంటూ... వెంకటేశ్ జ్ఞాపకాలను అతని కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు.

సమర్థవంతంగా పని చేయాలి

- ఎన్నికల నిఘా బృందాలకుమెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్ కర్కోటి సూచన



దుబ్బాక టౌన్: ముగ్గులను పరిశీలిస్తున్న సమీర్, అదనపు కలెక్టర్ గరీమా

సిద్దిపేటరూరల్: ఎంపీ ఎన్నికల్లో భాగంగా ఎక్కడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చూసుకోవాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్ కర్కోటి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎన్నికల నిఘా విభాగాల నోడల్ అధికారులతో కలిసి మెదక్ లోక్‌సభ జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్ కర్కోటి, కలెక్టర్ ఎం.మనుచౌదరి సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటును వేసేలా ఎన్నికల నిఘా బృందాలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర ముఖ్యం

దుబ్బాకటౌన్: బీఎల్‌ఓలు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర ముఖ్యమైందని పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్‌కోటి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏఆర్‌ఓ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి ఆయన సందర్శించారు. పోలింగ్ రోజు ఓటర్లకు కల్పించే సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూంపల్లి అక్బర్‌పేట మండల కేంద్రంలో చెక్‌పోస్టును, లచ్చపేట మోడల్ స్కూల్లో గల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో స్వీప్ ఆధ్వర్యంలో మెప్మా సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు వేసిన ముగ్గులు, రంగోలిని పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీలైన ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సీపీఎం నాయకులను కోరారు. మంగళవారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం నాయకులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ మెదక్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. తమ పార్టీ శ్రేణులకు సూచిస్తామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నియంతృత్వ పోకడలను అవలంబిస్తోందన్నారు. నియంతృత్వ, కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక పాలన నుంచి బయటపడటానికి బీజేపీని ఓడించడం తప్పనిసరని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాజీ ఎంపీపీ జూలకంటి ఆంజనేయులు, కౌన్సిలర్ నాగరాజు, రుద్రారం మాజీ సర్పంచ్ వెంకన్న, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు యేసురాజు

గజ్వేల్‌రూరల్: వర్సిటీ సౌత్‌జోన్ జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు యేసురాజు ఎంపికైనట్లు పీఈటీ గోవర్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 29న ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌లో గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన ఏసురాజు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఏడుగురి పై కేసు నమోదు

తొగుట(దుబ్బాక): మండలంలోని మెట్టు వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ వైన్స్ పై దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు తొగుట ఎస్‌ఐ లింగం తెలిపారు. మండల పరిధిలోని మెట్టు వైన్స్‌పై బీర్ల కోసం ఆదివారం రాత్రి దాడి చేశారని తెలిపారు. అందులో కస్తూరి సత్యరామ్‌రెడ్డి, మట్టి రజనీకాంత్‌రెడ్డి, కస్తూరి రాజును మంగళవారం రిమాండ్ చేశామని తెలిపారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలో పట్టుకుంటామని వివరించారు.

మొక్కలు ఎండవద్దు



గాంధీనగర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ దేవకీ దేవి

- జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి

హుస్నాబాద్‌రూరల్: వేసవి ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని నర్సరీలో మొక్కలు ఎండకుండా జాగ్రత్త పడాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లో నర్సరీ, డంపింగ్ యార్డుతో పాటు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ, నర్సరీలో మొక్కలకు నిత్యం నీళ్లు పట్టాలన్నారు. ఎండ వేడి తగలకుండా గ్రీన్ నెట్ వాడాలన్నారు. గ్రామాల్లో రోజూ సేకరించే తడి,పొడి చెత్తను విధిగా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. తద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. సేంద్రియ ఎరువును స్థానిక రైతులకు విక్రయిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామాల్లో ఎవరూ పనులు లేవని ఇంటి వద్ద ఉండకుండా అందరికీ ఉపాధి కింద పనులు కల్పించాలని చెప్పారు. కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా నీడ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్, ప్రథమ చికిత్సకు సంబంధించిన వైద్య సదుపాయాలను కల్పించాలని సూచించారు. కూలీలు పనులు చేసిన వారికి వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలొస్తే వెంటనే పరిష్కారం చేసి సరఫరా చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. పైపులైన్ మరమ్మతులకు ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి, ఏఓ నాగరాజు ఉన్నారు.

యువ న్యాయ్ గ్యారంటీలపై అవగాహన

సిద్దిపేటఅర్బన్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు, నిరుద్యోగులకు అందించే యువ న్యాయ్ గ్యారెంటీలపై పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ ఆధ్వర్యంలో మొహబ్బత్ కీ దుకాణ్ కార్యక్రమం నిర్వహించారు. భర్తీ భరోసా, నౌకరీ పక్కా, పేపర్ లీకేజీల నుంచి విముక్తి, గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రత, యువ రోషిణి గ్యారంటీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు రఘుపతి పాల్గొన్నారు.

డీఈఓకు ఘన సన్మానం



టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లా రెండో స్థానంలో నిలవడంతో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో పీఆర్టీయూ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, బొల్లం రాజశేఖర్, ప్రార్థ సారది, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. డీఈఓను టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొప్పెట్ల యాదగిరి, సెక్టోరియల్ అధికారి రామస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్యాడర్ పది రోజులు శ్రమించాలి

- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో ఎంపీ అభ్యర్థి, నాయకులు

పటాన్‌చెరు: మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో ఏఐసీసీ సెక్రటరీ, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి విశ్వనాథ్‌తో కలిసి ఆమె ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ఎన్నికలకు కొద్ది రోజులే గడువు ఉందన్నారు. ఈ పది రోజులు శ్రమించాలని సూచించారు. కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కాగా సమావేశానికి ఎంపీ అభ్యర్థి నీలం మధు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నిర్మల హాజరయ్యారు. సమావేశంలో పటాన్‌చెరు ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, గజ్వేల్ ఇన్‌చార్జి తూంకూంట నర్సారెడ్డి, దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన మూడు రోజులకే..

- నవదంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టిన లారీ
- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం
- రామంతాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఘటన



వెంకటేశ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): పెళ్లయిన మూడు రోజులకే జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెంది భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారు.. జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీలతతో చిన్నశంకరంపేట మండలం జంగరాయికి చెందిన ఎర్రొల్ల వెంకటేశం(23)కు ఏప్రిల్ 26న వివాహమైంది. పెళ్లి అనంతరం ఇద్దరి కుటుంబాల్లో జరగాల్సిన కార్యక్రమాలు ముగిశాయి. సోమవారం రాత్రి వెంకటేశం తన భార్య శ్రీలతను తీసుకొని బైక్‌పై అత్తారింటికి వస్తున్నారు. రామంతాపూర్ శివారులోకి రాగానే రామాయంపేట వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ.. బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలు ఎగిరి కిందపడగా ముఖం రోడ్డుకు తగిలి తీవ్రగాయాలైన వెంకటేశం అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా శ్రీలత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే మరో బైక్‌పై వస్తున్న బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన శ్రీలతను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు కుటుంబీకులు తరలించారు. వెంకటేశం తల్లి సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. నూతన జంటలో భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పోతాన్‌పల్లితో పాటు జంగరాయి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



ధర్మారం-మిరుదొడ్డి రోడ్డుకు ఇరువైపులా ఆకట్టుకుంటున్న గుల్‌మోహర్ చెట్లు

‘గుల్ మోహర్’ కనువిందు

దారి పొడవునా గుల్ మోహర్ చెట్లు కనువిందు చేస్తున్నాయి. మండు వేసవిలో సైతం పచ్చదనాల మధ్య ఆరేంజ్ రంగులో వికసించిన పుష్పాలు ఆకర్షిస్తూ ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండల పరిధిలోని ధర్మారం-మిరుదొడ్డి రహదారికి రోడ్డుకిరువైపులా ఈ చెట్లున్నాయి. ఈ దారిలో ప్రయాణిస్తున్న వారు చల్లదనంతో పాటు మానసికోల్లాసాన్ని పొందుతున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)